క్లుప్తంగా

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 35, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 40, బీర 35, వంకాయ 30, గోకర 40, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20–30, అల్లం 180, వెల్లుల్లి 150.

ఎంఆర్‌పీఎస్ దీక్షకు మద్దతు



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి జైపాల్

శేరిలింగంపల్లి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ నిరాహరదీక్షకు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని టీపీసీసీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జే.జైపాల్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన ఎంఆర్‌పీఎస్ నిరాహరదీక్షలకు శనివారం ఆయన మద్దతు ప్రకటిస్తూ నిరాహారదీక్ష చేపట్టిన వారిని అభినందించారు. దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్, నరేష్,రాజు, అంజయ్య, మౌనిక, సావిత్రి, యాదయ్య, ప్రమీల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల రెవిన్యూ కార్యాలయం ముందు అంగన్‌వాడీ ఉద్యోగులు వారం రోజులుగా చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ శనివారం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జే జైపాల్ నాయకత్వంలోని కాంగ్రెస్ నాయకులు అంగన్‌వాడీల సమ్మె చేస్తున్న శిభిరాన్ని సందర్శించి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సురేష్, జహంగీర్, అజీముద్దీన్, ముక్కయ్య, పోచయ్య, కవిరాజ్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్

గచ్చిబౌలి: గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకొనేలా చూడాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ విగ్రహ ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు రోజూ జరిగే పూజలు, కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోడ్లపై ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, ఎస్‌ఐ శోభన్‌బాబు పాల్గొన్నారు.

‘యశోద’లో సింపోజియం స్పోర్ట్స్ మెడ్ కార్యక్రమం



మాదాపూర్:మాదాపూర్‌లోని యశోధ హస్పిటల్‌లో హైటెక్‌సిటీ టోనాబోలిక్ ఫిట్‌నెస్ టీమ్‌తో కలసి శనివారం సింపోజియం స్పోర్ట్స్ మెడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ సంగీత స్వరకర్త ఎంఎం కీరవాణీ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ డీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని బసవేశ్వర విగ్రహం నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రవి, బీజేపీ పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆగారెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

‘చవితి’ సందడి ప్రారంభం

- మట్టి ప్రతిమల పై కనబరుస్తున్న ఆసక్తి
- వినాయక మండపాలు సిద్ధం చేస్తున్న కమిటీ సభ్యులు

మియాపూర్: వినాయక చవితి సందడి మొదలైంది. సోమవారం పండగ కావడంతో విగ్రహాల ఏర్పాటులో స్థానికులు బిజీగా ఉన్నారు. బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్‌లలో వినాయక మండపాలు ప్రత్యేక డిజైన్లలో భక్తులకు ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బస్తీ, కాలనీ,అసోసియేషన్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

- మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీ, మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన వినాయక ప్రతిమలను అమ్మకానికి కొలువుదీరాయి. ఒక్క అడుగు ఎత్తు నుండి 12 ఎత్తు గల విగ్రహాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. మియాపూర్ ప్రాంతంలో బీకే ఎన్‌క్లేవ్ వద్ద విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అదే విధంగా విగ్రహాల తయారీకి ముఖ్య కేంద్రంగా చెప్పుకునే ధూల్‌పేట్‌లో రూపొందించిన విగ్రహాలను తెచ్చి ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు.
- కాలనీ, బస్తీలలోని వాడ , వాడలా వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి ఒక్కొక్కటిగా విగ్రహాలు ఆయా మండపాలకు చేరుతున్నాయి.
- పర్యావరణానికి ఎలాంటి హని కలిగించని విధంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని వాడ, వాడలా ప్రజలకు చైతన్యం చేస్తున్నారు.
- పర్యావరణ ప్రేమికులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు గణనాధుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఎక్కువగా మట్టి విగ్రహాలకే గిరాకీ పెరుగుతోందని వ్యాపారులు తెలుపుతున్నారు.
- ఉత్సవాలను పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు, జలమండలి అధికారులు, విద్యుత్ విభాగ అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా మియాపూర్ పోలీసులు, నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహిస్తున్నారు.







విక్రయాలకు సిద్ధంగా ఉంచిన గణనాథుల విగ్రహాలు





గణ నాథునికి తుది మెరుగులు దిద్దుతున్న చిత్రకారులు



ఆకర్షణీయంగా మండపాలు

పచ్చదనంతోనే వాతావరణ సమతుల్యత



అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కిషోర్ కుమార్

శేరిలింగంపల్లి: సృష్టిలోని సకల జీవరాసుల మనుగడకు వాతావరణ సమతుల్యను సాధించడానికి పచ్చదనాన్ని పెంచాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ ఎట్మాస్పియర్ సైన్సెస్ ప్రొఫెసర్ కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో లింగంపల్లి హైస్కూల్‌లో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్‌ను వినియోగించడంతో పాటు రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను , శబ్ద, వాయు కాలుష్యాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

హెల్త్ ఏటీఎం ప్రారంభం



హఫీజ్‌పేట్ : మదీనాగూడలోని ప్రణామ్ హాస్పటల్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏనీ టైమ్ క్లినిక్ హెల్త్ ఏటిఎంను జెమ్ టెక్నాలజీస్ సీఈఓ వినోద్ కుమార్, ఎండీ వెంకటేశ్వర్లు, ప్రణామ్ హాస్పటల్ చైర్మన్ మనీష్‌గౌర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రక్త పరీక్షలు చేసి రోజుల తరబడి రిపోర్టుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడేది అని అన్నారు. కానీ ఇప్పుడు హెల్త్ ఏటిఎంతో క్షణాల్లో రక్త పరీక్షలు చేసి 75 రకాల రోగ నిర్ధారణ పరీక్షలపై రిపోర్టులు తెలియజేస్తుందన్నారు.

క్లీన్ హెచ్‌సీయూ లక్ష్యం





రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని మరింతగా క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే ఎన్‌ఎస్‌ఎస్ విభాగం హెచ్‌సీయూ లక్ష్యమని కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో వైట్ రాక్ ప్రాంతంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, హెచ్‌సీయూ పారిశుధ్య సిబ్బంది, ఉద్యానవన శాఖ సిబ్బందితో కలిసి క్లీనింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగంతో పాటు విద్యార్థులు, పారిశుధ్య విభాగం సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో క్లీన్ క్యాంపస్ లక్ష్యం నెరవేరడం ఖాయమని ఆయన వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, సెక్షన్ ఆఫీసర్ మల్లేష్ పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్: మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చందానగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల స్థానికులకు ప్రజలకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ బంధు, బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, జీఓ 58, 59 ద్వారా జారీ అయిన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను మంత్రి హరీశ్‌రావుతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో పటాన్‌చెరు నియోజకవర్గానికి 10శాతంగా స్థానిక కోటా కింద కేటాయించాలని మంత్రి హరీశ్‌రావును విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలను విడతల వారీగా అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ శరత్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మట్టివినాయక విగ్రహాల పంపిణీ



గచ్చిబౌలి: పర్యావరణ హితమే లక్ష్యంగా కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రకాలనీ ఏబ్లాక్, బిబ్లాక్‌లో ఆర్‌కేవై టీమ్ సభ్యులు శనివారం మట్టివినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌కేవైటీమ్ సభ్యుడు గంగల చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌కే వైటీమ్ సభ్యులు , కాలనీవాసులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బిహార్ చేనేత హస్తకళా మేళా ప్రారంభం





బిహార్ చేనేత హస్కరకా మేళాను ప్రారంభిస్తున్న దృశ్యం

మాదాపూర్: నగరవాసులను బిహార్ చేనేత ఉత్పత్తులు అకట్టుకుంటాయని హైదరాబాద్ బిహార్ ఫౌండేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిరామ జి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం బిహార్ కనెక్ట్ 2023 చేనేత హస్తకళా మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూట ఇరవై చేనేత హస్తకళా ఉత్పత్తులు, కళాకారులు మేళాలో పాల్గొన్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆంపిథియేటర్‌లో డాక్టర్ బిందు అభినయ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.బిహార్ ఫౌండేషన్ హైదరాబాద్ చాప్టర్ జనరల్ సెక్రటరీ ఉత్తమ్‌యాదవ్, శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు. ఈ మేళా సెప్టెంబర్ 25వ తేదీ వరకు ఉంటుంది.

అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ పోటీలు



గచ్చిబౌలి: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈపీటీఆర్‌ఐ)లో ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలను నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం డైరెక్టర్ జనరల్ వాణీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆసిఫ్ ఖురేషీ, ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి రాజారావు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు తదితరులు ప్రసంగించారు.

మట్టి వినాయకుల పంపిణీ



హఫీజ్‌పేట్: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకున్ని పూజించాలని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలోని ఆరంభ టౌన్‌షిప్‌లో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కాలనీ వాసులు రవీంద్ర, మధుసుధన్‌రెడ్డి, రామ భూపాల్‌రెడ్డి, భిక్షపతి, రెహానా బేగం, రాజేష్, మహేష్, కుటుంబరావు, అరుణ, మానస, మౌనిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో పీస్ కమిటీ సమావేశం

గచ్చిబౌలి: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ప్రతిష్టాపన పూజలు, నిమజ్జనం వరకు జరిగే కార్యక్రమాలన్నీ ప్రశాంతంగా సాగేలా అందరూ సహకరించాలని కోరారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు





ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్ చెరువులోని గణేష్ నిమజ్జన కోనేరులో ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గోపీ చెరువు కోనేరులోని మురికి నీరు తొలగించి, మంచి నీటితో నింపాలన్నారు. అదే విధంగా కోనేరుకు వచ్చే మార్గాన్ని రాకపోకలకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సునీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటాయని నటి కామాక్షి భాస్కర్ల పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న సూత్ర ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, నూతనంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతుగా ర్యాలీ



నిరసన తెలుపుతున్న ముదిరాజ్ సంఘాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని చిటుకుల్ సర్పంచ్ నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించేలా సీఎం కేసీఆర్ పునరాలోచించాలని కోరుతూ ముదిరాజ్ సంఘాల నాయకులు శనివారం బొల్లారంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు చట్ట సభల్లో ప్రాధాన్యతను కల్పించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.